# దేశ టైమ్స్

DESHA TIMES

TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

హైదరాబాద్, : తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందించారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరఫున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. రేపు(శుక్రవారం) ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.


నల్లగొండ | సంపుటి:16 | సంచిక:96 | ఎడిటర్: సయ్యద్ పాష | 24-04-2026 శుక్రవారము | పేజీలు :8 | వెల:1/-


# బెంగాల్‌లో గెలుపు మాదే..



పశ్చిమబెంగాల్ : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదేనని ప్రధాని నరేంద్రమోదీ ధీమా వ్యక్తంచేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా తాము స్వీట్లు పంచుతామని చెప్పారు. బెంగాల్‌లో రెండు విడతల ఎన్నికల పోలింగ్లో భాగంగా ఇవాళ తొలి విడత పోలింగ్ జరుగుతోంది. ఈ నెల 29న రెండో విడత పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో రెండో విడత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రధాని ప్రచారం చేస్తున్నారు. ఇవాళ నదియా జిల్లా లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటింగ్ భారీగా జరిగిన ప్రాంతాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని అన్నారు. ఈసారి భారీగా పోలింగ్ జరుగుతున్నదని, బీజేపీ గెలుపు ఖాయమని చెప్పారు. మే 4న బీజేపీ చరిత్ర సృష్టించనుందని అన్నారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందామని సభకు వచ్చిన జనాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీని ఓటర్లు సాగనంపబోతున్నారని అన్నారు. మే 4న ఎన్నికల ఫలితాల తర్వాత స్వీట్లతోపాటు ఝాల్‌ముడి కూడా పంచుతామని ప్రధాని అన్నారు. ఇటీవల బెంగాల్‌లో నేను ఝాల్‌ముడి తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాగా తొలి విడత ఎన్నికల పోలింగ్‌లో ఓటింగ్ భారీగా నమోదవుతోంది. ఉదయం 11 గంటలకే పోలింగ్ 45 శాతం దాటింది. కాగా ఈసారి ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామమని ప్రధాని అన్నారు.

# పెట్రోల్, డీజిల్‌ధరల పెంపుపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం



హైద్రాబాద్: పెట్రోల్ , డీజిల్ ధరలు పెరుగుతాయని వస్తున్న వార్తలపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది. ప్రభుత్వం వద్ద అలాంటి ప్రపోజల్ ఏమీ లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆ వార్తలన్నీ అవాస్తవమని, ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని ఉద్ఘాటించింది. ఈ మేరకు ఎక్స్ లో ఓ పోస్ట్ చేసింది. ఇలాంటి వార్తా కథనాలు పౌరుల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఉద్దేశించినవని, దురుద్దేశపూరితమైనవిగా మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. గత 4 ఏళ్లుగా పెట్రోల్ , డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్ అని స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా ధరలు పెరుగుతున్నా భారత పౌరులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో కూడా ఇంధన ధరలు పెరగొచ్చన్న ఊహాగానాలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ముఖ్యంగా బంగాల్ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు పెరుగుతాయని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ పేర్కొంది. ఏప్రిల్ 29న పోలింగ్ అనంతరం ఈ పెంపు ఉండొచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా ఈ వివరణ ఇచ్చింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులు చేశాయి. ప్రతిగా ఇరాన్ కూడా దాడులను తీవ్రతరం చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ ప్రతీకార చర్యల్లో ప్రపంచంలోని ఇంధన రవాణా మార్గాల్లో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ ను ప్రపంచ మార్కెట్లకు అనుసంధానంగా ఉంది. అంతేకాదు, ప్రపంచంలో ఐదోవంతు రవాణా ఈ జలసంధి నుంచే జరుగుతోంది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశన్నంటాయి. ఫలితంగా, పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు 70 డాలర్లుగా ఉన్న బ్యారెల్ చమురు ధర ప్రస్తుతం 100 డాలర్ల పైనే ట్రేడవుతోంది. అయితే, ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినా, భారత్ లో పెట్రోల్ , డీజిల్ ధరలు మాత్రం యథాతథంగా ఉన్నాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు ఆరు శాతం పెరిగి 95.89 డాలర్లకు చేరింది. ఫ్యూచర్స్‌లో యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 7 శాతానికి పైగా పెరిగి, 90.13 డాలర్లుగా ఉంది. కాగా, ఇటీవల ఇరాన్‌కు చెందిన తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపి, స్వాధీనం చేసుకొన్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో జరిగిన ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ కూడా మీడియాలో ధ్రువీకరించారు. అయితే, ఈ విషయంపై ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఐఆర్‌జీసీ దళం అమెరికా యుద్ధ నౌకల పైకి డ్రోన్లను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను ఒక్కసారిగా పెంచాయి. ఇదిలా ఉండగా, అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో పెట్రోలు బంకుల్లో ఒక్కో ట్రక్కుకు ఇంత డీజిల్ మాత్రమే నింపుతామని, అనధికారిక పరిమితులు ఉంటున్నాయని ట్రక్కుల యజమానుల సంఘాలు చెబుతున్నాయి. దీంతో తరచు పెట్రోలు బంకుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని, పైగా క్యూలైన్లు పెద్దగా ఉంటుండటంతో, సరకు రవాణాలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సరఫరాలు తక్కువగా ఉండటమే ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నాయి. నెలవారీ డీజిల్ కొనుగోళ్లపై ఇచ్చే డిస్కౌంట్లను కూడా పెట్రోలు బంకులు ప్రస్తుతం ఆపేశాయని వెల్లడించారు.

## ఎలక్ట్రిక్ వాహనాలే భవిష్యత్తు



హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఈ క్రమంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి నైపుణ్యం ఉన్న యువత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందని, భవిష్యత్తులో వీటిని 120కి పెంచుతామని తెలిపారు. ఏటా 25 వేల మంది యువతకు అత్యాధునిక సాంకేతికతలో శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రగతి మరింత వేగవంతం అవుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఆయిల్ మరియు గ్యాస్ కొరత ఏర్పడుతోందని, దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగాలని మంత్రి సూచించారు. బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, గ్రాఫైట్ వంటి కీలక ఖనిజాల వెలికితీతలో భారత్ స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశంలో ఉన్న సహజ వనరులను సమర్థవంతంగా వాడుకున్నప్పుడే 'ఆత్మనిర్భర్ భారత్' కల సాకారమవుతుందని ఆయన పేర్కొన్నారు. చైనా వంటి దేశాల ఆధిపత్యాన్ని తగ్గించి, మన స్వంత వనరులతో సాంకేతిక విప్లవం తీసుకురావాలని మేధావులకు పిలుపునిచ్చారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా కాలుష్య నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని, సోలార్ పవర్ మరియు గ్రీన్ ఎనర్జీ రంగాల్లో మరిన్ని పరిశోధనలు జరగాలని మంత్రి ఆకాంక్షించారు. దేశంలోనే మొదటిసారిగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (జూజ×) లో 'ఈవీ బ్యాటరీ సస్టైనబిలిటీ' కోర్సును ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ టెక్నాలజీ సెంటర్లలో కూడా ఇలాంటి కోర్సులను ప్రవేశపెట్టి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. నీటి యాజమాన్యం, బయో డైవర్సిటీ మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వాడకం పెరిగితేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని వివరించారు.

# రెండోరోజు కొనసాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మె




హైద్రాబాద్: డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ రెండో రోజుకు చేరుకుంది. తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నేతలు ఎక్కడికక్కడ డిపోల ముందు బైఠాయించి.. బస్సులను బయటికి రానీయకుండా అడ్డుకుంటున్నారు. మరోవైపు.. ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం.. తాత్కాలికంగా డ్రైవర్లు, కండక్టర్లను నియమించుకుని పాక్షికంగా బస్సులను తిప్పుతోంది. ఈ నేపథ్యంలోనే తాత్కాలిక సిబ్బంది నడుపుతున్న బస్సులను ఆర్టీసీ కార్మికులు ఎక్కడికక్కడ అడ్డుకుంటుండటంతో.. కొన్ని చోట్ల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పోలీసులు రంగంలోకి దిగి.. ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తాము వెనక్కి తగ్గబోమని ఆర్టీసీ జేఏసీ తేల్చి చెబుతుండగా.. చర్చలకు రావాలని, ప్రజలకు ఇబ్బంది కల్గించవద్దని ప్రభుత్వం కోరుతోంది. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ కార్మికులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో సర్కార్ ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ కానున్న తెలంగాణ మంత్రి వర్గం.. సమావేశం తర్వాత దీనిపై ఒక కీలక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బుధవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో సుదీర్ఘంగా భేటీ అయి చర్చించారు. ఆర్టీసీలో ప్రస్తుతం నెలకొన్న తాజా పరిస్థితులతోపాటు.. ఇటీవల ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన రిపోర్టులోని పలు అంశాలపై వీరంతా కూలంకషంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ కేబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ జేఏసీ కార్మికులతో ఇప్పటికే చర్చించిన ఐఏఎస్ కమిటీ.. వారి డిమాండ్లను పరిశీలించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందించింది. ఈ నేపథ్యంలోనే మంత్రి వర్గంలో ఆర్టీసీ సమ్మెపై ఏం చర్చించి.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది. కేబినెట్ భేటీ తర్వాత ఈ నివేదిక ఆధారంగా.. రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ప్రధాన డిమాండ్లు అయిన వేతన సవరణ, పెండింగ్ బకాయిలు, ఇతర సంక్షేమ పథకాలపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

# అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ




బూర్గంపహాడ్,: అంగన్ వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునీకరించడంతో పాటు అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల విధుల్లో ఆధునీకతను జోడించే దిశగా ఈ స్మార్ట్ ఫోన్లను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటివల్ల అంగన్‌వాడీలకు సేవలు సులభతరంగా ఉండటంతో పాటు పారదర్శకంగా ఉండేలా ఉపయోగ పడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా పారదర్శకంగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే వీలుంటుందన్నారు. అనంతరం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లను సీడీపీఓ రేవతితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి, సర్పంచులు కిషోర్‌నాయక్, మందా నాగరాజు, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, ఈఓ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్థానిక నాయకులు భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, మహిమూదాఖాన్, పూలపెల్లి సుధాకర్రెడ్డి, మండలంలోని అన్ని కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మేఘాలయ అంగన్వాడి విధానాలు తెలంగాణ లో అమలు!



హైద్రాబాద్: మేఘాలయ రాష్ట్రంలోని అంగన్ వాడి కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగా కాకుండా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అభిప్రాయవడ్డారు. చిన్నారులకు ఆటల ద్వారా విద్య నేర్పే విధానం, సృజనాత్మక వాతావరణం నేర్చుకునే ఆసక్తిని " పెంచుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా మేఘాలయ ఎర్లీ చైల్డ్ హుడ్ ప్రోగ్రామ్ ద్వారా 06 సంవత్సరాల చిన్నారులపై సమగ్ర దృష్టి సారిస్తూ ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలను సమన్వయం చేస్తూ అందిస్తున్న సేవలను మంత్రి ప్రశంసించారు. ఇక 1000 డేస్ ప్రోగ్రామ్ అమలు విధానాన్ని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ నుంచి పాప జన్మించి రెండేళ్లు పూర్తయ్యే వరకు ఉండే తొలి 1000 రోజుల్లో తల్లి శిశువుకు సమగ్ర సేవలు అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గిస్తూ, ఆరోగ్యవంతమైన అభివృద్ధిని సాధిస్తున్నారని పేర్కొన్నారు. మేఘాలయలో ఆసక్తి ఉన్న యువతకు మినిస్ట్రీ ఆఫ్ స్కిలింగ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారిని కమ్యూనిటీ వలంటీర్లుగా తయారు చేస్తున్నారని చెప్పారు. అంగన్వాడి టీచర్లతో పాటు అదనంగా వలంటీర్లు వ్యవస్థీకృతంగా పనిచేయడం, సమాజం మొత్తాన్ని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం మేఘాలయ మోడల్కు ప్రత్యేకతను తీసుకువచ్చిందని తెలిపారు. మేఘాలయ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. సమ్మె విరమించాలని ఆర్టిసి కార్మికులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మేఘాలయ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టిసి కార్మికుల సమ్మె కారణంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. చర్చల ద్వారా మాత్రమే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

# తెలంగాణలో టీజీపీఎస్సీ కొలువుల జాతర



హైద్రాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇక నుంచి ప్రతీ నెల ఒక నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన 2500 ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టింది. టౌన్ ప్లానింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), అగ్రికల్చర్, ఏఈ, డిప్యూటీ ఈఓ సహా పలు రకాల ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కొన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేయగా.. మిగతా పోస్టుల భర్తీకి ప్లాన్ చేస్తోంది. ఇప్పటి నుంచి నోటిఫికేషన్లను జారీ చేయడంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా.. అభ్యర్థులు ప్రిపేర్ అయ్యేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కసరత్తులు చేపట్టింది. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన సుమారు 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు, పరీక్షల షెడ్యూల్ తయారు చేసే పనిలో టీజీపీఎస్సీ అధికారులు నిమగ్నం అయ్యారు. ఈ నేపథ్యంలోనే చాలా రోజుల తర్వాత తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-2) పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవలె టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పీసీబీ అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. త్వరలోనే అదే విభాగంలోనే మరో 6, 7 రకాల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు కూడా చర్యలు చేపట్టింది. వీటితోపాటు కీలకమైన టౌన్ ప్లానింగ్, అగ్రికల్చర్ ఆఫీసర్లు.. పలు శాఖల్లోని అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి కూడా కమిషన్ అధికారులు దృష్టి సారించారు. ఇక విద్యా శాఖలోనూ డిప్యూటీ ఈఓలు, డైట్ లెక్చరర్లు, బీఈడీ లెక్చరర్ల పోస్టులతో పాటు ఆర్టీసీ, సివిల్ సప్లై విభాగాల్లోని పలు పోస్టుల భర్తీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. రకరకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయడమే కాకుండా.. పరీక్షలు నిర్వహించడంలోనూ సరికొత్త విధానాన్ని పాటించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇతర రాష్ట్రస్థాయి ఉద్యోగాలతోపాటు.. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ వంటి నేషనల్ లెవల్ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని.. టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌ను తయారు చేస్తోంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ పరీక్షలు రాసే నిరుద్యోగులకు.. ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయనుంది. ఇక వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) అప్‌డేట్ చేయాలని ఇప్పటికే టీజీపీఎస్సీ పేర్కొన్నా.. చాలామంది నిరుద్యోగులు మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. తెలంగాణలో సుమారు 30 లక్షల మంది ఓటీఆర్ కలిగి ఉండగా.. వారిలో 12 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా పలు పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవాలని.. అందుకు గడువు 2 సార్లు పెంచినా ఇప్పటికీ కేవలం 6 లక్షల మంది మాత్రమే అప్‌డేట్ చేసుకున్నట్టు టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలనే కొత్త ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపాయి.

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

వరంగల్ : వరంగల్ ఆర్టీసీ నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రయత్నం. శంకర్ గౌడ్ అనే ఆర్టీసీ డ్రైవర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే స్పందించిన సిబ్బంది మంటలు ఆర్పి.. అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. అతనికి తీవ్రమైన కాలిన గాయాలవ్వడంతో వెంటనే వరంగల్‌లోని ఆసుపత్రికి తరలించారు, అక్కడ అతను ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### కోర్టులో పెండెన్సీ తగ్గిందని చెప్పు కోవడానికి ఎలాంటి ఆధారాలు చూపలేదు...

సకాలంలో అందని న్యాయం న్యాయమే కాదు. అందుకే 'ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచిన వాడు బయట ఏడుస్తాడు' అన్న జనశ్రుతిఉండనే ఉంది. ఒకపక్క కోర్టుల్లో పెండింగ్ కేసుల గురించి పదే పదే చర్చించుకుంటున్నాము. ఎందరో మేధావులు ఎన్నె న్నో సలహాలు, సూచనలు ఇస్తుంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మారినప్పుడల్లా పెండెన్సీ తగ్గించేం దుకు ఎన్నో న్యాయపరమైన సంస్కరణలు తెస్తూనే ఉంటారు. అయినా కోర్టులో పెండెన్సీ తగ్గిందని చెప్పు కోవడానికి ఎలాంటి ఆధారాలు చూపలేదు. లోకాయుక్త లలోమధ్యవర్తిత్వం, రాజీ అయినా మరికొన్ని కేసులు జమ అవుతూనే ఉంటాయి. కోర్టు ఏ స్థాయిదైనా మౌలిక వసతులు, వనరులు లేని కోర్టులలో న్యాయం చెప్పే విషయంలో ఎలాంటి జాప్యం అవుతుందో అత్యున్నత ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ఆ దివారం హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో చెప్ప చూసారు. కొన్ని అమూల్యమైన సంగతులను నివేదించారు. అందరికీ న్యాయమనే లక్ష్యం సాకారం కావాలంటే సరైన మౌలిక వసతులు అవసరం. న్యాయవ్యవస్థ స్వతంత్రపై తీర్పులు, సమావేశాలు, రాజ్యాంగ చర్చల్లో తరచూ మాట్లాడుకుంటున్న విషయాలే. చెల్లాచెదురుగా ఉండే ఇరుకిరుకు భవనాల్లో హైకోర్టు నిర్వహణ ఇబ్బంది కరమే. న్యాయవ్యవస్థ స్వతంత్రకు మౌలిక వసతులు అత్యంత అవశ్యకం.హైదరాబాద్లో వంద ఎకరాల్లో హైకోర్టు సముదాయ నిర్మాణం పూర్తయితే సమగ్ర న్యాయ నిర్వహణకు అవకాశముంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిభాషణలో వ్యక్తమయిన అభిప్రాయాలివి. పనిచేసే వాతావరణం లేని చోట ఎవరూ పనిచేయజాలరు. ప్రధానంగా న్యాయనిర్ణేతలుగా ఉండే వారికైతే ఇరువైపులా వాదనలు వినేందుకు ప్రశాంత వాతావరణమూ ముఖ్యమే. ఇలాంటి అభిప్రా యం న్యాయ కోవిదులందరిలోనూ ఉన్నా ఆచరణ దుస్సాధ్యం. అందుకే కొత్తగా నిర్మించుకునే భవనాలు ఆ రీతిలో ఉండాలని భావిస్తుంటారు. ఇప్పుడు తెలంగాణలో అలాంటి పరిస్థితులు కలిసొచ్చాయి. పనులు సజవుగా సాగుతున్నాయి. తెలంగాణలో ఆ లక్ష్యం క్రమేపీ ఆచర ణలోకి వస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రజలకు కోర్టు అంటే బెంచ్, జాతీయ చిహ్నం, విచారణలు మాత్రమే కన్పిస్తాయని, వాటి వెనుక నిలువెత్తు నిబ్బరంగా ఉండే మౌలిక వసతులే కోర్టును నడిపిస్తాయని ఆయన భావన. ప్రస్తుతమున్న హైకోర్టు భవనాలు అవసరాలకు సరిపోకపోవడంతో రాబోయే నూరేళ్ల అవసరాలకు సరిపడే విశాలమైన, ఎన్నో మౌలిక వనరులు, వసతులు ఉన్న నూతన హైకోర్టు భవనాలను వేగవంతంగా నిర్మించుకుంటున్నం దుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు.భారీ వృక్షం నిలబడాలంటే వేర్లు ఎంత బలోపేతంగా ఉంటాయో అదే మాదిరి న్యాయ వ్యవస్థకు అన్ని సౌకర్యాలూ ఉన్న భవనాలు అవసరమే నన్నారు. పాత తీర్పుల ప్రతులకు భద్రతస్థానం ఎంతో ముఖ్యమైనదైనందున తెలంగాణ హైకోర్టులో సకల సౌక ర్యాలున్న వేర్వేరు భవన నిర్మాణాలు చోటు చేసుకోవడం ప్రధాన న్యాయమూర్తిని ఆకట్టుకుంది. రాజ్యాంగం సజీ వంగా ఉండాలంటే న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఒకే లక్ష్యంతో గమనాన్ని చేరడం అవసరమన్నది ఆయన ఆలోచన. ప్రతి కోర్టు గది వెనుక దాన్ని నడిపించే ఓ ప్రపంచ ఉంటుంది. అక్కడే న్యాయమూర్తులు నివసిస్తా రు. శిక్షణ తీసుకుంటుంటారు. అలాంటి న్యాయాలయా నికి పునాదులు వేసే కార్యాచరణ ఎంతో శుభప్రదం. అదొక రాజ్యాంగ విధిగా భావిస్తున్నట్లు వివరించారు. ప్రతి రాష్ట్రంలో ఓ హైకోర్టు చట్టపరమైన అవసరమే కాకుండా గణతంత్ర రాజ్య నిబద్ధతగా భావించాల్సి ఉం టుంది. అలాంటి నిబద్ధతకు ఆధారమైన మౌలిక సదుపా యాలు ఉన్నంత వరకే అర్థం ఉంటుంది. కాకుంటే కేవలం కాగితాల్లోనే మిగిలిపోతుంది. అలా కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ సమాంతరంగా ఒక సంయుక్త బాధ్యతతో నడక సాగించడం వలన అదొక నిర్దిష్ట రూపాన్ని సంతరించుకోవడం కళ్లెదుట సాక్షాత్కరిస్తోందని జస్టిస్ సూర్యకాంత్ ఒక సమగ్ర న్యాయవ్యవస్థకు మౌలిక వనరుల రూపకల్పనకు నిర్దిష్ట ఆచరణ ఉందంటూ, ఇదే మాదిరి సంకల్పంతో ఇతర రాష్ట్రాల్లో కూడా కోర్టులకు మౌలిక సదుపాయాలు అవసరమని నమ్ముతున్నారు.ఒక పటిష్టమైన ఆలోచనకు సాదృశ్యమైన ఒక విశేషాన్ని ప్రధాన న్యాయమూర్తి సభముందుంచారు. సమగ్ర మూ లాల్లేని ఏ వ్యవస్థకైనా కూకటివేళ్లే ముఖ్యమన్న పరమా వధిని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఒక భారీ వృక్షానికి కొమ్మలు, ఆకులు మాత్రమే కనిపిస్తాయి. కానీ ఉధృతం గా తుపాను వచ్చిన సందర్భంలో వేర్లు మాత్రమే ఆ చెట్టును పడిపోకుండా నిలబెడతాయన్నది గుర్తించాల్సి ఉంటుంది. ఇవన్నీ న్యాయవ్యవస్థ మౌలిక వనరులు, వసతులపై ప్రధాన న్యాయమూర్తి వివరించిన విషయాలే. ఎన్నో కోర్టుల్లో కేసుల చిట్టాలు దాచుకునేందుకు కనీసం పటిష్టమైన గదులు ఉండవు. ఎక్కడైనా కోర్టుస్టోర్రూ మ్ లు గమనిస్తే ఫైళ్ల ర్యాక్లు సరిగ్గా ఉండవు. యాభై యేళ్ల నాటి భవనాలున్న చోటవర్షాలకు ఎన్నో రికార్డులు తడిసి పోయి ఉండటం చూస్తుంటాము. న్యాయమూర్తు ల క్వార్టర్లు న్యాయాలయాల సముదాయంలో కాకుండా ఎక్కడో ఉంటే న్యాయమూర్తులు ఎక్కడో దూరంగా వసతి ఉన్న సందర్భాలలో ట్రాఫిక్రద్దీలో ఇరుక్కుని కోర్టులకు ఆలస్యంగా హాజరైతే ఎంతో మంది కక్షిదారులు ఇక్కట్లకు గురౌతుంటారు. ఇలాంటి సమస్యలన్నీ న్యాయవ్యవస్థలో అనుభవైకవేద్యమే!

## అపజయం సమయంలో విద్యార్థులకు అండగా నిలవాలి



మహబూబ్ నగర్, : శిలను శిల్పాను చేసే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఐడిఓసిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 19,775 మంది విద్యార్థులు, మొత్తం 192 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, డ్రాప్స్ ఔట్ లను తగ్గించి ఎన్రోల్మెంట్ పెంచాలన్నారు.విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రావీణ్యంతో తీర్చిదిద్దేందాలని,భవిష్యత్తులో యంత్రాల ప్రాధాన్యం పెరుగుతుందని, విద్యార్థుల్లో మానసిక స్థైర్యం అవసరమన్నారు. అపజయాల సమయంలో విద్యార్థులకు అండగా నిలవాలని,సోషల్ బిహేవియర్, కుటుంబ విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. శారీరక శిక్షలు కాకుండా మార్గదర్శకంతో విద్యార్థులను సరిదిద్దాలని, టీచర్ తలిస్తే రాయిని కూడా వజ్రంగా మార్చగలరని పేర్కొన్నారు.డిజిటల్ బోర్డులు, డిజిటల్ పాఠ్యపుస్తకాలతో ఫలితాల్లో గణనీయమైన మెరుగుదల కావడం జరిగిందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత శాతం 50% నుంచి 94% వరకు పెరిగినట్లు వెల్లడించారు. శతశాతం కార్యక్రమాన్ని 8, 9 తరగతులకు విస్తరించాలని, ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాల కోసం ప్రత్యేక ఫారమ్, నిధుల సమీకరణ బాధ్యత తనదేనని,ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ట్రిపుల్ ఐటీ సాధన కోసం ఏర్పాటు చేసిన శిక్షణకు ఉదయం 5 గంటల నుంచే బోధన, ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనం అన్నారు. గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజీలో 992 మార్కులు ప్రభుత్వ లెక్చరర్ల కృషి ఫలితగానే సాధ్యం కావడం జరిగిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ప్రతి ఒక్కరు నిబద్ధత తో తమ విధులను నిర్వహించి మంచి విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, జగపతి రావు, ఫరూక్ హుస్సేన్, వెంకట నర్సయ్య, మహబూబ్నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



సూర్యాపేట, : మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణ మహో త్సవములు ఈ నెల నుండి మే 4 వరకు నిర్వహిస్తున్న ందున ఈ కళ్యాణోత్సవములకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని వి సి హాల్ నుండి వేబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవమునకు వస్తున్న వేలాది మంది భక్తులకు ఎటువంటి ఆటంకములు లేకుండా మిషన్ భగీరథ శాఖ నిరంతరం నీటి సరఫరా చేయాలని, పోలీస్ శాఖ పటిష్ట భద్రత కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు, ఒక అంబులెన్స్ సిద్ధముగా ఉంచే విధముగా ఏర్పాటు చెయ్యాలని సూచించారు.ఆర్టీసీ కళ్యాణ మహోత్స వ ములకు అదనపు బస్సులు ఏర్పాటు చే యాలని, విద్యుత్ శాఖ సరఫరాకు ఆటంకం కలగకుండా నిరంతరం సరఫరా ఉండే వి ధంగా చూడాలన్నారు. మట్టపల్లి గ్రామపంచాయతీ దేవాలయ పరిసర ప్రాంతాలు పారిశుధ్యం చేయుటకు, ఫైర్ సర్వీస్ వారిని ఫైర్ ఇంజన్ స్టాండ్ బై చేయుటకు, సాగర్ సి మెంట్, నాగార్జున సిమెంట్ వారి సహకారంతో భక్తులకు స్నాక్స్ అందించుట, దేవ స్థానం వారు క్యూలైన్స్ ఏర్పాటు, పార్కింగ్ స్థలంలో సీసీ కెమెరా ఏర్పాటు, వృద్ధులకి, దివ్యాంగులకు ఉచిత ఆటో ఏర్పాటు పకడ్బందీగా చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ డి శిరీష, ఆర్డిఓ వి.శ్రీనివాసులు, కె భాస్కర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కే భాస్కర్, నల్గొండ, దేవస్థాన అను వంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయకుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకండి..




నల్లగొండ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా దరిత్రితో పాటు, ప్రకృతి పెను విపత్తును ఎదుర్కొంటున్నదని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను నిషేధించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. " అంతర్జాతీయ మాతృ భూమి" దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీని కేంద్రీయ విద్యాలయ వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ప్రపంచం పెను ప్రమాదంలో చిక్కుకుందని, దీనివల్ల వాతావరణ, జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతున్నాయన్నారు. మానవ తప్పిదాలు, వివాదాల వల్ల మనుషులతో పాటు, జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడింద న్నారు. ప్లాస్టిక్ వినియోగం అనంతరం డీకంపోస్టు చేయకపోవడం వల్ల ఇది భూమితో పాటు, ప్రకృతిని నాశనం చేస్తున్నదని, దీని నుండి బయట పడేందుకు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలు నాటి దరిత్రిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ఒకవేళ వాడినట్లైతే తిరిగి దానిని వినియోగించడం, రీసైకిల్ చేయడం వంటి వాటిపై దృష్టి సారించాలని, ఈ నినాదం ప్రతి గృహానికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అప్పుడే మనం భూమిని, ప్రకృతిని కాపాడగలుగుతామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా ప్రతి ఒక్కరూ బయటికి,లేదా మార్కెట్ కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కాటన్ చేతి సంచులు వాడాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కు బదులు స్టీల్ లేదా మట్టి బాటిల్స్ వాడడం, ప్లాస్టిక్ మెటీరియల్ వాడకుండా చూడాలని, ఈ విషయంపై అన్ని చోట్ల అవగాహన కల్పించాలని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్నిచోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం ప్రకృతిని కాపాడే అంశంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు."అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం" సందర్భంగా ప్రతి ఒక్కరు భూమి కి ప్రతిరూపమైన అమ్మను గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేయాలని, అప్పుడే మనం అనుకున్న అందమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు.డీఎఫ్ఓ రాజశేఖర్, జిల్లా యువజన ,క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి తదితరులు ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన వారందరి చేత "అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవ" ప్రతిజ్ఞను చేయించారు. అంతేకాక అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం పై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఇటీవలే ఇబ్రహీంపట్నం మండలంలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ కొనుగోలు జరగకపోవడంతో ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మార్క్ఫెడ్ డీఎంతో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. నిల్వలో ఉన్న మక్కలను కొనుగోలు చేయడంలో ఆలస్యం జరుగుతోందని, మార్కెట్ యార్డు మొత్తం మక్కలతో నిండిపోయిందన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం ఇంచు స్థలం కూడా లేకపోవడం వల్ల రైతులు తమ పంటను విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు తమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. వర్షాలు పడితే రైతులకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలుకు కూడా మార్కెట్లో సరిపడా సదుపాయాలు లేవని, రైతులకు ఎన్నికల సమయంలో ఆశ చూపించి చివరికి వెన్నుపోటు పొడుస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. రైతుబంధు సకాలంలో అందడం లేదని, యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని తెలిపారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో రైతుబంధు సకాలంలో అందించడమే కాకుండా, ఎరువుల కొరత లేకుండా చూసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలేచి వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది

శంకర్ పల్లి : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది తెలంగాణ రాష్ట్ర సభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు, మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం బద్దం సురేందర్ రెడ్డి గార్డెన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మండల విద్యాధికారికి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యోగ విరమణ సర్వ సాధారణమన్ అని అన్నారు. అక్కడ పని చేసిన గుర్తింపు పొందేలా పని చేసి పేద విద్యార్థుల విద్యా అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. శంకర్ పల్లి మండలంలో 2015 జులై 10 న జన్వాడ గజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులుగా పదవి బాధ్యతలు చేపట్టి, మండల విధాధికారి గా అదనపు బాధ్యతలు చేపట్టి సుదీర్ఘంగా అధికార విధులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ ఎస్ గి టి గా 1989 సెలెక్ట్ అయి నేటికీ 41 సంవత్సరాలు పూర్తి చేశారని కొనియాడారు. జిల్లా విద్యాధికారి శుశింద్ర రావు మాట్లాడుతూ అక్బర్ పదవి విరమణ తర్వాత తన శేష జీవితం సుఖంగా-ఆరోగ్యంగా ఉండాలని, పదవి విరమణ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల టి ఆర్ ఎస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చిన్న నర్సింలు, గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్, మండలం లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షేమ వారోత్సవ కార్యక్రమం

కొత్తపల్లి, : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో 'వెల్ఫేర్ వీక్' ( సంక్షేమ వారోత్సవం) రోజున నగరంలోని కాశ్మీర్ గడ్డ ఉమెన్స్ డిగ్రీ కళాశాల సమీపంలో గల ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ హాస్టల్ పరిసరాలను తనిఖీ చేసి,హాస్టల్ వి ద్యార్థుల గదులతో పాటు మౌలిక సదుపాయాలను పరిశీలిస్తూ హాస్టల్ ఆవరణలో పారిశుధ్య కార్మికులు సిబ్బందితో కలిసి పరిశుభ్రత పనులను నిర్వహిస్తూ, చెత్తాచెదారం, కలుపు మొక్కలు తొలగించారు.హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో పెరిగినప్పుడే చదువు పై శ్రద్ధ చూప గలరన్నారు. వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులు, సిబ్బంది మీ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ సువార్త, వెటర్నరి అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎంహె చ్ ఓ సుమన్, సానిటేషన్ సూపర్ వైజర్లు శ్యామ్ రాజ్, అనిల్, ఎస్ప్లు వెంకన్న, హాస్టల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# మే 1 కోసం కొత్త సినిమాల కొట్లాట



ఏప్రిల్ 30 'పెద్ది' తప్పుకున్నాక అందరి దృష్టి ఆ స్లాట్ మీద పడింది. ఇది ముందే ఊహించిన 'గాయపడ్డ సింహం' తెలివిగా మే 1 రిలీజ్ డేట్ ని దిల్ రాజు సమక్షంలో ప్రకటించుకుని సేఫ్ గేమ్ ఆడింది. ఎలాగూ రామ్ చరణ్ వచ్చేలా లేడని ప్రాక్టికల్ గా అలోచించి ఇలా చేయడం ప్లస్ అవుతోంది. ఆల్రెడీ ప్రమోషన్లు కూడా మొదలుపెట్టేశారు. విచిత్రంగా పెద్ది పోస్టుపోన్ గురించి అఫీషియల్ గా ఎలాంటి అనౌన్స్ మెంట్ ఇప్పటిదాకా రాలేదు. అయినా సరే అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పుడీ డేట్ మీద గాయపడ్డ సింహం ఒకటే కాదు వేరే సినిమాలు కూడా ప్లాన్ చేసుకునే ఆలోచనలో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైంది నిఖిల్ 'స్వయంభు'. ఫిబ్రవరి నుంచి వాయిదా పడుతూ సరైన డేట్ కోసం ఎదురు చూస్తున్న ఈ ప్యాన్ ఇండియా మూవీ ఇప్పుడు ఏప్రిల్ 30 లేదా మే 1 వచ్చే ఆలోచనలో ఉంది. సమంతా 'మా ఇంటి బంగారం' ముందు అనుకున్న మే 15 కాకుండా రెండు వారాలు అడ్వాన్స్ అవ్వాలని చూస్తోందట. కంటెంట్ మీద టీమ్ కాన్ఫిడెంట్ గా ఉంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కాంబోలో రూపొందుతున్న 'ఎపిక్'ని అదే డేట్ కి దింపితే ఎలా ఉంటుందనే ఆలోచనలో సితార సంస్థ ఉన్నట్టు వినికిడి. ఒకవేళ ఇది సాధ్యం కాదనుకుంటే ఇదే బ్యానర్ లో రూపొందిన అశోక్ గల్లా 'వీసా'ని రిలీజ్ చేసే ఆప్షన్ కూడా చూస్తున్నారట. చేతిలో కేవలం నెల రోజుల సమయం మాత్రమే ఉంది కాబట్టి ప్రమోషన్లు, సెన్సార్ల, పోస్ట్ ప్రొడక్షన్లు అన్నీ పూర్తి చేసుకోవాలి. ముఖ్యంగా ఫైనల్ కాపీలు సిద్ధం చేసుకోవాలి. ఇప్పటికైతే ఇవన్నీ డిస్కషన్ల స్టేజిలోనే ఉన్నాయి. గాయపడ్డ సింహం మాత్రమే కన్ఫర్మ్ చేసుకోగా మిగిలినవి ఏ క్షణం ఏవి ప్రకటన ఇస్తాయో చూడాలి. ఒక్క పెద్ది మిస్ చేసుకోవడంతో ఇండస్ట్రీలో ఇంతటి వేడి వాతావరణం నెలకొందన్న మాట. ఇవే కాదు మరికొన్ని సినిమాలు కూడా మే 1 వైపు చూస్తున్నాయట కానీ కాంపిటీషన్ ఎంత మోతాదులో చెక్ చేసుకుని ఆ తర్వాత డిసైడ్ కాబోతున్నాయి. వెయిట్ సంగతి సరికాని ఇంతకీ పెద్దికి మోక్షం ఎప్పుడో చెప్పాలని మెగా ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.

# రాముడి పాత్ర వద్దన్న రణబీర్



ఒక పెద్ద సినిమాలో రాముడి పాత్రను పోషించడం ఏ నటుడికైనా అరుదైన అవకాశమే. దాన్ని లైఫ్ టైం ఛాన్స్‌లాగే ఫీలవుతారు ఎవ్వరైనా. 'ఆదిపురుష్' ఫలితం ఎలా ఉన్నప్పటికీ అందులో రాముడి పాత్ర చేసినందుకు ప్రభాస్ ఎంతో సంతోషించాడు. 'వారణాసి'లో కాసేపు ఆ పాత్రలో కనిపించబోతున్నందుకు మహేష్ బాబు సైతం ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉన్నాడు. ఐతే బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీర్ కపూర్ మాత్రం.. 'రామాయణ'లో రాముడి పాత్ర పోషించడానికి వెనుకంజ వేశాడట. నిర్మాత నమిత్ మల్హోత్రా నాలుగేళ్ల ముందు ఈ సినిమాలో నటించమని అడిగినపుడు తాను వెంటనే నో చెప్పినట్లు రణబీర్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు. రాముడి పాత్ర చేయడానికి తాను సరిపోనని.. దానికి పూర్తి న్యాయం చేయలేనని తాను భావించి.. ఆ పాత్ర చేయడానికి నిరాకరించినట్లు రణబీర్ వెల్లడించాడు. కానీ ఆ తర్వాత తాను ఒక బిడ్డకు తండ్రినయ్యానని.. అప్పుడు తనకు రాముడి పాత్ర చేయాలని అనిపించిందని.. తండ్రి కావడం తన జీవితంలో గొప్ప మలుపు అని రణబీర్ చెప్పాడు. నితీశ్ తివారి దర్శకత్వంలో 'రామాయణ' సినిమా చేయడానికి పదేళ్ల ముందు అడుగులు పడ్డాయి. అల్లు అరవింద్‌తో కలిసి వేరే నిర్మాత ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చాడు. ఏళ్ల తరబడి చర్చలు జరిగాయి. కానీ చివరికి నమిత్ మల్హోత్రా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాడు. రాముడు, సీత పాత్రలకు చాలామంది నటీనటుల పేర్లు పరిశీలించి.. చివరికి రణబీర్ కపూర్, సాయిపల్లవిలను ఫైనలైజ్ చేశారు. ఇందులో యశ్ రావణుడి పాత్ర చేస్తున్నాడు. గత ఏడాది విడుదలైన 'రామాయణ' గ్లింప్స్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ఈ సినిమా నుంచి రాముడి పాత్రకు సంబంధించి గ్లింప్స్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ ఏడాది దీపావళికి 'రామాయణం' పార్ట్-1 రిలీజ్ కాబోతోంది. వచ్చే ఏడాది దీపావళికి రెండో భాగం రిలీజ్ చేయాలనుకుంటున్నారు. రెండు భాగాలకు కలిపి రూ.4 వేల కోట్ల బడ్జెట్ పెట్టినట్లు నిర్మాత వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిరిసిల్ల : ఇళ్ల పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నిత్యయం తడి, పొడి చెత్తలను వేరుచేసి ట్రాక్టర్‌లకు ఇవ్వాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు రాజీవ్‌నగర్‌లో పారిశుధ్య నిర్వహణ అవగాహన కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్ బుర్ర మల్లికా ర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లో మున్సిపల్ అధికారులతో కలిసి చైర్‌పర్సన్ పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇళ్ళులతోపాటు వ్యాపార సముదాయాల నుంచి ఉత్ప త్తి అయ్యే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలుగా వేరుచేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. అదేవిధంగా మురుగు నీటి కాలువలో రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో చెత్త వెయ్యరాదన్నారు. ఇళ్ల పరిస రాలలో ఎక్కడ కూడా అనవసరపు నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులు, కూలర్లలో ఎప్పటికప్పుడు నీటిని మారుస్తూ శుభ్రం గా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎండాకాలం దృష్ట్యా నీటిని అన వసరంగా వృథా చేయకుండా అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలని నీటి సమస్యలు ఏర్పడకుండా చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం ప్రజ లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాదిర్ ఫాషా, డీఈ వాణి, మాజీ కౌన్సిలర్ బుర్ర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్‌ను సవరించాలి

హైదరాబాద్:ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటులో సవరించడం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను పెంచుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల సలహాదారు కె.కేశవరావు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆ యాక్ట్‌లోని 26వ సెక్షన్ ద్వారా తెలంగాణలో 119 స్థానాల నుంచి 153కు, ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225 సీట్లకు పెంచుకునేందుకు అవకాశముందని తెలిపారు. అయితే యాక్ట్‌లో అవకాశం కల్పిస్తూనే రాజ్యాంగంలోని 170వ ప్రకరణకు లోబడి అనే షరతు ఆటంకంగా ఉందని తెలిపారు. లోబడి అనేది తొలగిస్తూ పార్లమెంటు చేసిన రీఆర్గనైజేషన్ చట్టంతోనే చేసుకునేలా చర్యలు తీసుకుంటే సరిపోతుందన్నారు. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఇరువురు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కె.కేశవరావు విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్‌ను -- డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ బిల్లు 2023లోనే ఏకగ్రీవంగా అమలయిందని చెప్పారు. డీలిమిటేషన్ బిల్లులో 50 శాతం పెంచుకునేందుకు అవకాశం లేదనీ దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్లలో దక్షిణాదికి, ఉత్తరాదికి మధ్య 283 సీట్ల తేడా ఉందనీ, కేంద్రం తెచ్చిన బిల్లు చట్టమైతే ఆ తేడా 420కి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక సామంత రాజ్యాలను భారతదేశంలో భాగస్వాములు చేసేందుకు వారు పెట్టిన షరతులు, డిమాండ్లపై అందరితో చర్చించి నాటి ప్రధానమంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూ, కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్ష నిర్ణయాన్ని స్వీకరించిందని తెలిపారు. అదే మార్గంలో దేశ భవిష్యత్తును నిర్ణయించే డీలిమిటేషన్ పై కేంద్ర ప్రభుత్వం అఖిలపక్షం అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు.

# కుషాయిగూడలో వివాహిత ఆత్మహత్య

హైదరాబాద్:మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. బీదర్ (కర్ణాటక)కు చెందిన రాజేందర్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజేందర్ సింగ్ కుమార్తె సోనం ఠాకూర్ (26)ను మౌలాలి ఇందిరానగర్‌కు చెందిన యోగేష్ ఠాకూర్‌కు 2020లో వివాహం చేశారు. అనంతరం దంపతులు మౌలాలి హెచ్‌బీ కాలనీలో నివసిస్తూ ఉండగా, వారికి ఒక కుమార్తె ఉంది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో సోనం ఫోన్‌కు స్పందించకపోవడంతో అనుమానం వ్యక్తం చేసిన తండ్రి, పక్కింటి మహిళ భారతేశ్వరమ్మను సంప్రదించారు. ఆమె ఇంటికి వెళ్లి పరిశీలించగా, సోనం బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే స్థానికులు ఆమెను కిందకు దించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే భర్త యోగేష్ మరియు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# రైతులు దళారులను ఆశ్రయించవద్దు

బోయినపల్లి, : రైతులు పండించిన ప్రతి వరి ధాన్య పు గింజలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతు లు తొందరపడి దళారులకు విక్రయించొద్దని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి తడ గొండ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు సెం టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభు త్వం అధిక నిధులను ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమం లో డసీఎంఎస్ మాజీ చైర్మన్ ముందుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహినొద్దీన్, ఎంపీడీవో జయ శీల, ఏవో ప్రణీత, నాయకులు కుస రవీందర్, వన్నెల రమణారెడ్డి రెడ్డి, సువిన్ యాదవ్, సర్పంచ్‌లు బింరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఏనుగుల కనకయ్య, నల్ల మోహన్ సుద్దా ల మధు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు పనులు వేగవంతం చేయాలి..




హైదరాబాద్, : రాష్ట్రంలో రూ.98 వేల కోట్లతో రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వీటిని వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 2028 చివరి నాటికి రోడ్ల నిర్మాణంలో దేశంలోనే తెలంగాణను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. దేశంతో పాటు, ప్రపంచం నలుమూలల నుంచి రోడ్డు కాంట్రాక్టర్లు, బిల్డర్లు హాజరయ్యే ప్రతిష్ఠాత్మక ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను వచ్చే నవంబరులో నిర్వహించనున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ సదస్సు నిర్వహణకు బీజేపీ పాలిత రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో తనకున్న సాన్నిహిత్యం వల్ల రాష్ట్రంలో నిర్వహించేందుకు ఒప్పించానన్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిర్వహణ అనంతరం రాష్ట్రానికి రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశముందని చెప్పారు. రూ.148 కోట్లతో నిర్మించనున్న అప్రోచ్ రహదారులతో 300 గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించనుందని ఆయన తెలిపారు. రూ.20 వేల కోట్లతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనులను చేపడుతున్నామని.. మొత్తం 8 లేన్లతో ఈ రహదారిని విస్తరిస్తున్నామని వెల్లడించారు. మన్ననూరు-శ్రీశైలం మధ్య 52 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.8 వేల కోట్లను కేటాయించామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి రూ.36 వేల కోట్లు మంజూరయ్యాయని, ఇది రాష్ట్రానికి గేమ్ చేంజర్ ప్రాజెక్టు అని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూసేకరణ కోసం ఈ నెల 8న రాష్ట్ర వాటాగా రూ.628 కోట్లను భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు జమ చేశామన్నారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను రూ.941 కోట్లతో చేపడుతున్నామని వివరించారు. ఇందులో కేంద్రం వాటా రూ.741 కోట్లు కాగా.. రాష్ట్రం నుంచి రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లను నిర్మించామని మంత్రి తెలిపారు. రోడ్ల నిర్మాణంతో రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు వస్తాయన్నారు. పరిపాలనలో మానవీయ కోణాన్ని మరిచిపోవద్దని, ప్రజాసేవలో నైతిక విలువలను పాటించాలని డిప్యూటీ సీఎం భట్టి కొత్తగా విధుల్లో చేరనున్న గ్రూప్-1 అధికారులకు సూచించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసానివ్వడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రూప్-1కు ఎంపికైన 214 మంది అధికారులకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. దీనికి హాజరైన భట్టి మాట్లాడుతూ.. అధికారులు సంతకం చేసే ప్రతి ఫైలు వెనుక సామాన్యుడి ఆశ ఉంటుందని, అలాంటి ఫైళ్లను కేవలం కాగితాలుగా కాకుండా జీవితాలను మార్చే శక్తిగా చూడాలన్నారు.

# తెలంగాణకు రైల్వే శాఖ గుడ్‌న్యూస్..

హైద్రాబాద్: తెలంగాణ రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి 8 కొత్త రైళ్లను రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. ఈ 8 కొత్త రైళ్లు వీక్లీ ప్రయాణం చేయనున్నట్లు తెలిపింది. కాచిగూడ, నాంపల్లి, చర్లపల్లి వంటి కీలక స్టేషన్‌ల నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఈ రైలు సర్వీసులు నడపనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. తిరుపతి, తిరుచానూర్, శ్రీ గంగానగర్, జైపూర్, భువనేశ్వర్ వంటి ప్రాంతాలకు కొత్త రైళ్లు నడవనున్నాయి. ఈ విషయాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ప్రయాణికులకు మరింత సులువైన ప్రయాణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 17607/17608 నంబర్ కలిగిన రైలు.. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లనుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు.. వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రతి గురువారం రోజున రాత్రి 9.30 గంటలకు ప్రారంభం కానుంది. 17601/17602 నంబర్ కలిగిన మరో రైలు.. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ రైల్వే స్టేషన్ ప్రయాణించనుంది. ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ జూలై 14వ తేదీ నుంచి ప్రతి శనివారం రాత్రి 10 గంటలకు పట్టాలు ఎక్కనుంది. 17047/17048 నంబర్ గల రైలు.. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్ తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు చేరుకోనుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు మే 7వ తేదీ నుంచి ప్రతి బుధవారం సాయంత్రం 6.55 గంటలకు మొదలు కానుంది. 17441/17442 నంబర్ కలిగిన రైలు.. ప్రతి బుధవారం రాత్రి 9.20 గంటలకు చర్లపల్లి స్టేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి బయలుదేరే వెళ్లే వీక్లీ స్పెషల్ రైలు మే 14వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. 17443/17444 నంబరుతో చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు రైలు తిరుపతికి వెళ్లనుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు మే 1వ తేదీ నుంచి మొదలు కానుంది. 17059/17060 నంబరు గల రైలు ప్రతి ఆదివారం రాత్రి 9.15 గంటలకు చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రారంభమై తిరుచానూరు వెళ్లే వీక్లీ స్పెషల్ రైలు మే 11వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. 17067/17068 నంబరు ఉన్న రైలు.. ప్రతి సోమవారం సాయంత్రం 6.10 గంటలకు చర్లపల్లి నుంచి భువనేశ్వర్ వెళ్లనుంది. ఈ వీక్లీ స్పెషల్ ట్రైన్ మే 5వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. 17079/17080 నెంబరుతో రైలు.. ప్రతి శుక్రవారం రాత్రి 7.50 గంటలకు నాంపల్లి నుంచి జైపూర్ (రాజస్థాన్) వెళ్లే వీక్లీ స్పెషల్ రైలు కూడా త్వరలోనే ప్రారంభం కానుండగా.. దాని ప్రారంభ తేదీని త్వరలోనే దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించనుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపంతో భారీ ఆర్థిక నష్టం



కట్టంగూర్ ఏప్రిల్ 22: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపంతో భారీ ఆర్థిక నష్టం జరిగిందని ప్రభుత్వ విఫ్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు నకరికల్ లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి తప్పుబడుతూనే ఉందన్నారు. తమ అవినీతి ఎక్కడ బయటపడుతుందో అనే భయంతో కోర్టును ఆశ్రయించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని, కోర్టు స్టే తెచ్చుకుని ఇప్పుడు కేసు మొత్తం గెలిచినట్లుగా గోబెల్స్ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కొన్ని అంశాలపై చర్యలు తీసుకోవద్దని మాత్రమే హైకోర్టు సూచించిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన నాణ్యత లోపాలు, నిర్మాణ లోపాల కారణంగా ప్రాజెక్టుకు భారీ నష్టం జరిగిందన్నారు. వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని పేర్కొన్నారు. బాధ్యత వహించాల్సింది వారే కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం అంటే అసలు దొంగలు ఎవరో తెలంగాణ ప్రజలు గమనించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా చేపట్టాలని ఈ ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. అవినీతికి ఎవరు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ నేతలు ఏటీఎంలా ఉపయోగించుకున్నారని వ్యాఖ్యానించారన్నారు. ఆ మాట వాస్తవమా కాదా అనేది ప్రజలే గమనించాలన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం కూడా తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. 10 ఏళ్ళు అధికారంలో ఉండి దోచుకుని దాచుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఇప్పుడు అహంకారంతో మాట్లాడడం సమంజసంగా లేదన్నారు. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఆ పార్టీ నాయకునికి గుణపాఠంగా నిలవాల్సి ఉండగా, ఆయనకు ఇంకా జ్ఞానోదయం అయినట్లు లేదని జగదీశ్వర్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కమిషన్ల కోసం, స్వప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి ప్రజల సొమ్మును దోచుకున్నారనేది తన విమర్శ మాత్రమే కాదని, ఇది ప్రజల్లో బలంగా ఉన్న అభిప్రాయమన్నారు. కాళేశ్వరం అవినీతిపై పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా ప్రభుత్వ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ ఆర్డీవో

నారాయణపేట, : ఏసీబీ దాడుల్లో నారాయణపేట జి ల్లా ఆర్డీవో రామచంద్రనాయక్ రూ.25000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఉట్కూరు గ్రామానికి చెందిన బాధితుడు బర్త్ సర్టిఫికెట్ విషయంలో ఆర్డీవో రామచంద్రనాయక్‌ను ఆశ్రయించాడు. ఆర్డీవో డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఆధారాలు సేకరించిన ఏసీబీ డీఎస్పీ బాలక్రిష్ణ ఆధ్వర్యంలో నారాయణపేట ఆర్డీఓపై నిఘా ఏర్పాటు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

# హైదరాబాద్‌లో డ్రోన్ల ద్వారా ఈ-కామర్స్ సేవలు




హైద్రాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ లాంటి నగరాల్లో ఏ వస్తువు కావాలన్నా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లలో బుక్ చేసుకుంటున్నారు. ఇక జెప్టో, బిగ్‌బాస్కెట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ కంపెనీలు 10 నిమిషాల్లోనే ఇంటి వద్దకు డోర్ డెలివరీ చేస్తున్నాయి. ఇందుకోసం నిత్యం వేల మంది గిగ్ వర్కర్లు ఈ ఈ-కామర్స్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ ఈ-కామర్స్ వస్తువుల డెలివరీకి డ్రోన్లు రంగంలోకి దిగనున్నాయి. హైదరాబాద్ నగరంలో వచ్చే ఏడాది నుంచి స్కై ఎయిర్ అనే సంస్థ డ్రోన్ల ద్వారా ఈ-కామర్స్ సేవలను అందించేందుకు చర్యలు చేపట్టనుంది. వచ్చే ఏడాది జులైలో హైదరాబాద్‌లో డ్రోన్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు హైసియా వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన ఒక ప్రదర్శనలో స్కై ఎయిర్ సంస్థ స్పష్టం చేసింది. తెలంగాణ సర్కార్‌తో కలిసి స్కై ఎయిర్ మెడిసిన్స్ ఫ్రం స్కై ప్రాజెక్ట్‌లో ఇప్పటికే ఈ స్కై ఎయిర్ సంస్థ భాగం కావడం గమనార్హం. గురుగ్రామ్, బెంగళూరు వంటి నగరాల్లో ఈ-కామర్స్ అల్ట్రా ఫాస్ట్ డ్రోన్ డెలివరీ సేవలను స్కై ఎయిర్ సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఢిల్లీలో నిత్యం 12 లక్షల డ్రోన్ డెలివరీలు చేస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇక హైదరాబాద్ నగరంలో రోజుకి 3.75 లక్షల డ్రోన్ డెలివరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. సాధారణంగా 30 కిలోమీటర్ల దూరం నుంచి ఏదైనా వస్తువును డెలివరీ చేయాలంటే.. ప్రస్తుతం వాహనాల ద్వారా ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో దాదాపు 2 గంటల సమయం పడుతుంది. కానీ ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో హైపర్ లోకల్ డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్ ద్వారా స్కై ఎయిర్ సంస్థ కేవలం 7 నిమిషాల్లోనే వస్తువులను డెలివరీ చేస్తుండటం విశేషం. గాలిలో డ్రోన్లు సేఫ్‌గా ఎగిరేందుకు వర్చువల్ స్కై టన్నెల్ ఏర్పాటు చేస్తారు. గోడౌన్ (వేర్‌హౌస్) నుంచి కస్టమర్ ఇంటి వరకు ఈ మార్గంలోనే ఆ డ్రోన్లు ప్రయాణిస్తాయి. ఆ రూట్‌లో ఇతర డ్రోన్‌లు ఉన్నాయా లేదా వాతావరణం ఎలా ఉందే చెక్ చేసేందుకు అన్‌మ్యాన్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కూడా ఉంటుంది. అందుకోసం భద్రతపరంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులను తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఆయా ప్రాంతాల్లో బేస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. కస్టమర్ల నుంచి ఆర్డర్ రాగానే ఆ బేస్ స్టేషన్ల నుంచి డ్రోన్లు ఎగురుతాయి. భూమికి 120 మీటర్ల ఎత్తులో ఈ డ్రోన్లు ఎగురుతాయి. ఇక కస్టమర్ వద్దకు చేరుకున్న తర్వాత భూమి నుంచి 20 మీటర్ల ఎత్తు వరకు దిగి.. ఆ వస్తువులను స్కైప్యాడ్ ప్రాంతంలో వదిలేస్తుంది. అయితే ఈ ప్రక్రియ మొత్తం 7 నిమిషాల్లో పూర్తి అవుతుందని స్కై ఎయిర్ సంస్థ తెలుపుతోంది. అక్కడి నుంచి ఆ వస్తువును డెలివరీ బాయ్ తీసుకుని.. చివరికి కస్టమర్‌కు అందిస్తారు. ఆ తర్వాత డ్రోన్ తిరిగి తన బేస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇక ఈ డ్రోన్లను ట్రాకింగ్ చేయడానికి, రియల్ టైమ్ నావిగేషన్ కోసం 5జీ మాడ్యుల్ అందుబాటులో ఉంటుంది. ఒక్కో డ్రోన్ గరిష్ఠంగా 10 కిలోల బరువు మోస్తుంది. సాధారణ డ్రోన్లను కంటికి కన్పించే దూరం వరకే ఆపరేట్ చేస్తారు. కానీ ఈ ఈ-కామర్స్ సేవలకు ఉపయోగించే డ్రోన్లు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అదే సమయంలో నగరంలో కంటికి కన్పించనంత దూరం వెళ్లాల్సి ఉంటుంది. దానికోసం బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పైలట్, ఆపరేటర్, రిమోట్ లేకుండానే కొన్ని డ్రోన్లు ఆటోమేటిక్‌గా ఎగురుతాయి. కానీ అవి సరిగ్గా వెళ్తున్నాయా లేదా అనేది సిస్టమ్ పర్యవేక్షిస్తుంది. దారిలో పక్షులు, డ్రోన్లు ఉంటే సెన్సర్లు గుర్తించి వాటి నుంచి తప్పిస్తాయి. డ్రోన్ ఎగురుతున్నంతసేపు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపిస్తూ ఉంటుంది. స్పీడ్, బ్యాటరీ, వాతావరణ పరిస్థితుల వంటి 255 రకాల సమాచారాన్ని డ్రోన్ బ్లాక్‌బాక్స్ రికార్డ్ చేస్తుంది. ఎమర్జెన్సీ సమయాల్లో డ్రోన్ సేఫ్‌గా ల్యాండ్ కావడానికి ఇన్‌బిల్ట్‌గా పారాచ్యూట్ ఉంటుంది.

## రోబోటిక్ సర్జరీతో రోగి ప్రాణం కాపాడిన హాస్పిటల్స్ వైద్యులు




హైదరాబాద్, : 53 ఏళ్ల రామారావు కు మొదట్లో కనిపించిన లక్షణాలు పెద్దగా ఆందోళన కలిగించేవిగా అనిపించలేదు. నిరంతర దగ్గు, పై పొట్టలో స్వల్ప అసౌకర్యం, సాధారణ గ్యాస్ట్రిక్ సమస్య అనుకుని కొన్ని రోజులు నిర్లక్ష్యం చేశారు. కానీ సమస్య తగ్గకపోవడంతో చివరకు హైటెక్ సిటీలోని కేర్ హాస్పిటల్‌ని ఆశ్ర యించగా అసలు కారణం బయటపడింది, ఆహారనాళం, కడుపు కలిసే భాగంలో వచ్చే గ్యాస్ట్రోఈసోఫేజియల్ జంక్షన్ క్యాన్సర్. సమయానికి స్పందించిన వైద్య బృందం, అధు నాతన డా విన్చి రోబోటిక్ సిస్టమ్ సాయం తో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఈ సాంకేతికత ద్వారా శరీరంలోని సన్నని, క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా అత్యంత ఖచ్చితత్వంతో ట్యూమర్‌ను తొలగించడం సాధ్యమైంది. హైపర్టెన్షన్ , దయా బెటిస్ ఉన్న ఈ రోగికి పూర్తి గ్యాస్ట్రెక్టమీ (కడుపు పూర్తిగా తొలగింపు) చేసి, జేజునోస్టమీ ద్వారా ఆహార మార్గాన్ని పునర్నిర్మించారు. ఈ శస్త్రచికిత్సను కేర్ హాస్పిటల్స్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎన్. కరుణాకర్ రెడ్డి గారి నాయకత్వంలో, డాక్టర్ ముస్తఫా హుస్సేన్ రజ్వీ, వారి బృందం విజయవంతంగా నిర్వహించారు. రోగికి కడుపు లో ప్రభావిత భాగాన్ని తొలగించి, ఆహారం వెళ్లే మార్గాన్ని పునర్నిర్మించారు. ఆహారనాళాన్ని చిన్న ప్రేగుతో కలిపి, అవసరమైన చోట్ల ప్రేగులను అనుసంధానం చేశారు. అదనంగా రోగి కోలుకునే సమయంలో ఆహా రం అందించేందుకు ప్రత్యేక ట్యూబ్ ఏర్పా టు చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి స్థితి స్థిరంగా ఉండి, అవసరమైన వైద్య చికిత్సలతో త్వరగా కోలుకొని, ప్రస్తుతం ఇంటికి వెళ్లి ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. హైటెక్ సిటీలోని కేర్ హాస్పిటల్స్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎన్. కరుణాకర్ రెడ్డి, మాట్లాడుతూ, ఆహారనాళంకడుపు కలిసే భాగంలో వచ్చే క్యాన్సర్లు గుర్తించడం కాస్త కష్టం. ప్రారంభంలో స్పష్టమైన లక్షణాలు ఉండవు కాబట్టి చాలా మంది రోగులు ఆలస్యంగా వస్తారు. నిరంతర అసౌకర్యం, కారణం లేకుండా వచ్చే దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. సమయానికి గుర్తించి, రోబోటిక్ సర్జరీ వంటి ఆధునిక సాంకేతికతతో చికిత్స చేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. ఈ టెక్నాలజీ ద్వారా సన్నని, చేరుకోలేని ప్రాంతాల్లో కూడా ఖచ్చితంగా శస్త్రచికిత్స చేయగలుగుతున్నాం, అని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలేష్ గుప్తా మాట్లాడుతూ, ఈ కేసు సమయానికి వైద్య పరీక్షలు ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. క్లిష్టమైన క్యాన్సర్ కేసుల్లో మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమన్వయం ఎంత ప్రభావవంతంగా ఉంటుందో ఇది చూపించింది. కేర్ హాస్పిటల్స్‌లో మేము అధునాతన వైద్య సేవలను అందించేందుకు మా సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేస్తున్నాం, అని చెప్పారు. జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లు భారతదేశంలో క్యాన్సర్ కారణంగా జరిగే మరణాల్లో ముఖ్యమైన వాటిలో ఒకటి. ప్రారంభ దశలో లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల చాలా కేసులు ఆలస్యంగా గుర్తించబడుతున్నాయి. అవగాహన, సమయానికి వైద్య పరీక్షలు చాలా అవసరం. ఈ కేసు కేర్ హాస్పిటల్స్‌లో ఉన్న అధునాతన గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఆంకాలజీ నైపుణ్యాన్ని, సమగ్ర వైద్య విధానాన్ని ప్రతిబింబిస్తోంది.

# తెలంగాణలో స్మార్ట్ మార్కెట్ యార్డులు




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్‌యార్డులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మార్కెట్ యార్డుల్లో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా, అక్కడి కార్యకలాపాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 198 మార్కెట్ యార్డులు ఉంటే.. వాటిలో కార్యకలాపాలు మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా దిగుబడి కూడా పెరుగుతుండటంతో మార్కెట్ యార్డులకు వచ్చే రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇలా మార్కెట్ యార్డులకు పంట ఉత్పత్తులు ఎక్కువగా వస్తుండగా.. ఆదాయం మాత్రం పెద్దగా పెరగలేదు. మార్కెట్ యార్డులకు ఆదాయం రాకపోవడానికి కారణాలను అధికారులు పరిశీలిస్తే.. యార్డుల్లో సరుకుకు సంబంధించిన వివరాలు నమోదు సరిగా జరగడం లేదని తేలింది. కొంతమంది వ్యాపారులు రసుములు కూడా చెల్లించకుండా క్రయవిక్రయాలు చేస్తున్నారు. మాన్యువల్ కారణంగా యార్డుల్లో అక్రమాలకు అవకాశం ఏర్పడింది. చాలామంది వ్యాపారులు రూ.లక్షల్లో రుసుములు చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకే మార్కెట్ యార్డుల్ని డిజిటలైజ్ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఐటీ, ఏఐ సాంకేతికతలతో స్మార్ట్ మార్కెట్‌యార్డు సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. కొత్తగా రూపొందించిన ఈ స్మార్ట్ మార్కెట్‌యార్డు సాఫ్ట్‌వేర్‌ను ముందుగా గడ్డిఅన్నారం మార్కెట్‌లో ఉపయోగించాలని నిర్ణయించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన మార్కెట్ యార్డుల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. మార్కెట్ యార్డుల ఎంట్రీ, వై బ్రిడ్జిల దగ్గర సెన్సార్లు అమర్చి కంప్యూటర్లకు కనెక్ట్ చేస్తారు. అలాగే ఏఐ సాయంతో సర్వైలెన్స్ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు.. అప్పుడు మార్కెట్‌లోకి వచ్చే వాహనాలు, సరుకులు, తూకం వివరాలు నమోదు చేయొచ్చు. మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్లు సహా అన్ని వివరాలు ఈజీగా నమోదవుతాయి.. ఆన్‌లైన్‌లో రసీదులు కూడా ఉంటాయి. ఈ వివరాలు మొత్తం మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయానికి కూడా వెళతాయి. ఒకవేళ వ్యాపారులు ఎవరైనా రైతుల నుంచి పంటల్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కారణాలపై ఆరా తీసిన తర్వాతే ఆమోదం తెలుపుతారు. మొత్తం మీద తెలంగాణలో స్మార్ట్ మార్కెట్‌లు అందుబాటులోకి రానున్నాయి.

# సీపెక్ సర్వే దేశానికి ఆదర్శం




హైదరాబాద్: తెలంగాణ సామాజిక-ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సీపెక్) దేశానికి ఆదర్శమని ఇండిపెండెట్ ఎక్స్?పర్ట్ కమిటీ గ్రూప్ వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సభ్యులు ప్రవీణ్ చక్రవర్తి, భాగ్య బుక్యలతో కలిసి హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపెక్ సర్వేపై చేసిన అధ్యయనాన్ని వివరించారు. మండల్ కమిషన్ 11 ప్రమాణాలను ప్రాతిపది కగా తీసుకుని సర్వే చేయగా, సీపెక్ సర్వే మాత్రం 3.55 కోట్ల మంది ప్రజల వద్ద 42 ప్రమాణా లతో 75 అంశాల సమాచారాన్ని సేకరించామని తెలిపారు 10 లక్షల జనాభాకు పై బడిన కులాలు 10 ఉండగా, 20 కులాలు మొత్తం జనాభాలో 75 శాతం ఉన్నాయనీ, 56 కులాలు 90 శాతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఓసీలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు మూడు రెట్లు వెనకబడ్డారని అన్నారు. ఉద్యోగ అసమానతలు ఎస్సీ, ఎస్టీల్లో అధికంగా ఉన్నాయన్నారు. సాధారణ కులాల్లో కేవలం 10 శాతం మంది మాత్రమే రోజువారీ కూలీలుగా పనిచేస్తుండగా, షెడ్యూల్డ్ కులాలు, తెగలో దాదాపు 50 శాతం మంది రోజువారీ కూలీలుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే 99శాతం ఎస్టీలు, 97 శాతం ఎస్సీలు వెనుకబడినవారని అన్నారు. తెలంగాణ లోని ప్రజల సామాజిక, ఆర్థిక వెనుకబా టుతనానికి జీవన పరిస్థితుల మధ్య ఉన్న అంతరాలను సర్వే స్పష్టం చేసిందన్నారు. అత్యంత దిగువ స్థాయిలో ఎస్టీ కొలాం సమాజం లోని 64.7 శాతం కుటుంబాలకు కుళాయి నీటి సౌకర్యం లేదన్నారు. ఇది రాష్ట్ర సగటు కంటే మూడు రెట్లకు పైగా ఉందన్నారు. అయితే విద్యుత్ కొరత అన్ని వర్గాల్లో ఒకేలా లేదని చెప్పారు. కొన్ని వర్గాల్లో ఈ అంతరాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాల వారు, ఇప్పటికీ ఇరుకైన చిన్న చిన్న ఇండ్లలో నివసిస్తున్నారని తెలిపారు. 75 శాతం ఎస్టీలు, 73శాతం ఎస్సీలు రెండు గదుల కన్నా తక్కువ ఉన్న ఇండ్లలో ఉంటున్నారని వివరించా రు. 13.3 శాతం కుటుంబాలకు ఇంట్లో మరుగుదొడ్ల సౌకర్యం లేవన్నారు. కాంపోసిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండిక్స్ ఆధారంగా పకడ్బందిగా సర్వే చేసినట్టు తెలిపారు. ఈ సర్వే ప్రకారం ఆయా కులాలు తమతమ వెనకబాటు తనం, అభివృద్ధిని అంచనా వేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలను పొందేందుకు ఈ సర్వే ప్రామాణికంగా ఉపయోగపడుతుందని అన్నారు.

## యాచకులపై జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్

హైద్రాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో అధికారులు బెగ్గర్స్ రిహాబిలిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ప్రధాన చౌరస్తాలు, దేవాలయ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నాంపల్లి రైల్వేస్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, కేబీఆర్ పార్కు, అంబర్‌పేట చౌరస్తా, అమీర్‌పేట చౌరస్తా, బల్కంపేట టెంపుల్, నానల్‌నగర్ చౌరస్తా,తెలంగాణ సమాచారంఆరాంఘర్ చౌరస్తాలో ఈ ప్రత్యేక డ్రైవ్‌లో 107 మంది యాచకులను గుర్తించగా, 37 మందిని చౌటుప్పల్ సమీపంలోని అమ్మా-నాన్న అనాథాశ్రమానికి తరలించారు. అక్కడ వారికి అవసరమైన వైద్య పరీక్షలు, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మరో 40 మందిని జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ షెల్టర్స్ హోమ్స్‌లో ఎన్జీవోల సహకారంతో చేర్చించారు. మిగతా వారికి కౌన్సిలింగ్ చేసి వారి స్వస్థలాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు.

## సైబర్ నేరాలకు బ్యాంకింగ్

# వ్యవస్థలో లోపాలే కారణం..

## ఆర్బీఐ గవర్నర్‌కు సీపీ సజ్జనార్ లేఖ



హైద్రాబాద్: దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలపై.. హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. భారీ ఆపరేషన్లతో సైబర్ నెట్‌వర్క్‌లను బయటికి లాగుతున్నారు. ఇటీవలె ఆపరేషన్ ఆక్టోపస్‌లో 104 మంది.. ఆపరేషన్ ఆక్టోపస్ 2.0 చేపట్టి 52 మంది సైబర్ నేరగాళ్లను పట్టుకుని.. వారి నెట్‌వర్క్‌ను దెబ్బతీసిన సంగతి తెలిసిందే. అదే సమయంలో దాదాపు రూ.300 కోట్ల మోసాలను బట్టబయలు చేశారు. అయితే ఈ సైబర్ నేరాలలో మ్యూల్ అకౌంట్లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు సైబర్ పోలీసుల విచారణలో తేలింది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లకు.. పలువురు బ్యాంక్ అధికారులే సాయం చేస్తున్నట్లు గుర్తించి.. వారిని కూడా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు.. మంగళవారం ఒక కీలక లేఖ రాశారు. దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలకు కారణం.. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలేనని ఆ లేఖలో సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఈ సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే.. బ్యాంకింగ్ సిస్టమ్‌లో సమూల మార్పులు తీసుకురావాలని ఆర్బీఐ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలు, లొసుగులే ఇప్పుడు అమాయక ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరస్థులకు వరంగా మారాయని సీపీ సజ్జనార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి ఆపరేషన్లలో మ్యూల్ ఖాతాలు, వాటిని సమకూర్చేందుకు నేరగాళ్లకు సహకరిస్తున్న పదుల సంఖ్యలో బ్యాంక్ సిబ్బందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. వాటిలో ఉన్న లొసుగులను గుర్తించారు. మ్యూల్ అకౌంట్లను ఓపెన్ చేసేందుకు కేవైసీ ధ్రువీకరణలో బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని ఎత్తిచూపారు. ఇలాంటి లోపాలు జరిగినపుడు.. సంబంధిత బ్రాంచ్ అధికారులను బాధ్యులను చేసేలా వాణిజ్య బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు ఇవ్వాలంటూ సజ్జనార్ విన్నవించారు. అధిక శాతం అక్రమ ఖాతాలు ప్రైవేటు బ్యాంకుల్లోనే ఉన్నాయని తెలిపారు. కొన్ని బ్యాంకులు ఆర్బీఐ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని సీపీ సజ్జనార్ వెల్లడించారు. సైబర్ నేరగాళ్లకు సహకరించిన వారితోపాటు ఛార్జిషీట్ నమోదైన బ్యాంకు అధికారులను శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఈ మ్యూల్ అకౌంట్లను సమీక్షించేందుకు ఆర్బీఐ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, నగర పోలీసులతో జాయింట్ వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏవైనా అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు జరిగితే వాటిని క్షణాల్లో గుర్తించే టెక్నాలజీ సిస్టమ్‌లను తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆర్బీఐ గవర్నర్‌కు రాసిన లేఖలో సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

సిరిసిల్ల : వేసివిలో తాగునీట ఎద్దడి లేకుండా చూడాలని అలాగే నిత్యం తాగునీరు సరఫరా జరిగేలా చూడా లని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసి ల్ల సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, నీటి పారుదల శాఖ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీరు, పారుశుధ్య పనులపై సమీక్షించారు. ముందుగా మున్సిపాల్టీలు, అన్ని మండలాల వారీ గా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా లక్ష్యం ఎంత సరఫరా అవుతుందని స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని మున్సిపల్ కమిషనర్‌లతో పాటు ఎంపీడీవోలు, మిషన్ భగీర?థ ఏఈలను అడిగి తెలుసుకు న్నారు. తాగునీరు సరఫరా కోసం ఇంకా ఏమికావాలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి మున్సిపాలిటీ, గ్రామాల్లో తాగునీరు సరఫరా, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిం చారు. వేసవి నేపథ్యంలో రానున్న 45 రోజులు చాలా కీలకమని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా లక్ష్యం మేరకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డు, విలీన ప్రాంతాలు, అన్ని మండలాల్లోని గ్రామాలు, చివరి ప్రాంతాలకు నీరు సరఫరాలో ఎక్కడా ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళిక తో ముందుకువెళ్లాలని ఆదేశించారు. నీటి టాంక్‌లు, పైప్‌లైన్‌లలో లీకేజీ లేకుండా చూడాలని, ఇన్‌టేక్ వెల్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో మోటార్లు ఎప్పుడూ నడి చేలా ఏర్పాట్లుచేసుకోవాలని, ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయా లని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్ట్‌లో నీటి మట్టాన్ని పరిశీలించాలన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తే స్థానికంగా ఉన్న వనరులను వినియోగించాలని తెలిపారు. నీటిని రోజూ క్లోరినే షన్ చేయించాలని, పది రోజులకు ఒకసారి నీటి టాంక్‌లు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అమృత్ పథకం కింద జిల్లాలో మొదలుపెట్టిన ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇబ్బందులుంటే జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్ట ర్ గడ్డం నగేష్, మిషన్ భగీరథ ఎస్ఈ అమరేం దర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, పబ్లిక్‌హెల్త్ ఈఈ సంపత్, డీఆర్డీవో గీత, సీపీవో శ్రీనివాసా చారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీవో షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఈఎస్ఐ రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, అన్ని పదవులకు ఏకగ్రీవంగా నాయకులను ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్, సీనియర్ వైద్యులు డాక్టర్ వెంకటేష్ బాబు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ యు ఆదిత్య, కోశాధికారిగా డాక్టర్ గోలి విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ దుర్గా పద్మజా, డాక్టర్ లోకేష్ ఎంపిక కాగా, జీసీ సభ్యులుగా డాక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డాక్టర్ రాచన్న ఎన్నికయ్యారు. నూతన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సీనియర్ వైద్యుడిని ఈఎస్ఐ డైరెక్టర్‌గా నియమించే దిశగా ప్రయత్నిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఈఎస్ఐని రాష్ట్ర వ్యవస్థపై జరుగుతున్న అన్యాయాలను అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో మద్దతు తెలిపిన వైద్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

మిర్యాలగూడ, : ప్రభుత్వ దావఖానాలో వైద్య సేవలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్ఆర్ ) అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులకు అందుతున్న వైద్య సేవలను, ఆసుపత్రి మౌలిక వసతులను, సిబ్బంది పని తీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకోవడంతో పాటు మందుల పంపి ణి ఆహారంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమయపాలన పాటించి పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగేలా చూడాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్ని విభాగాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ రంగయ్యను ఆదేశించారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280